మనం
కడప | అన్నమయ్య

## 11వ బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ రిహార్సల్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ



వివరాలు 5లో

# రాజంపేట మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం కల్పించండి





పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కోరిన దొంతం శివప్రసాద్

కార్యకర్తల బలమైన మద్దతు, కూటమి నేతలతో సత్సంబంధాలే నా బలం

అవకాశమిస్తే మున్సిపల్ పీఠాన్ని గెలిచి కానుకగా అందిస్తా

రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి దొంతం శివ ప్రసాద్

మనం ప్రతినిధి రాజంపేట సెప్టెంబర్ 23
రాబోయే రాజంపేట మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ తరపున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని రాజంపేట పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్ కోరారు. విజయవాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తనకు క్షేత్రస్థాయి కార్యకర్తల బలమైన మద్దతు ఉందని, స్థానికంగా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులతో ఉన్న సత్సంబంధాలు, సమన్వయంతో పార్టీ గెలుపునకు తిరుగులేకుండా పనిచేస్తానని, అధిష్ఠానం నమ్మకంతో బాధ్యత అప్పగిస్తే మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుని ఘన విజయాన్ని కానుకగా ఇస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దొంతం శివప్రసాద్ మాట్లాడుతూ... పార్టీ ఆవిర్భావం నుంచి నిబద్ధతతో పనిచేస్తూ, బీసీ సామాజిక వర్గం ప్రతినిధిగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నానని తెలిపారు. రాజంపేట పట్టణంలో బూత్ స్థాయి కార్యకర్తల నుంచి ముఖ్య నాయకుల వరకు అందరితోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్ తనకు సంపూర్ణ మద్దతుగా నిలుస్తోందని వివరించారు. స్థానిక కూటమి నాయకులతో ఉన్న పరస్పర విశ్వాసం, స్నేహపూర్వక వాతావరణం ఎన్నికల్లో పార్టీ విజయానికి బలమైన పునాదిగా మారుతుందని పేర్కొన్నారు. రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు సమర్థ నాయకత్వంలో పట్టణం ఇప్పటికే అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ఆయన దిశానిర్దేశంలో కూటమి నేతలను, కార్యకర్తలను కలుపుకొని రాజంపేట మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ ఎదుగుదలకు శ్రమిస్తున్న బీసీ వర్గాల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని, మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందిస్తూ... తెలుగుదేశం పార్టీ బీసీల సంక్షేమం, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, పార్టీ కోసం పనిచేసే నిబద్ధత కలిగిన నాయకుల సేవలను తప్పక గుర్తిస్తుందని తెలిపారు. క్షేత్రస్థాయి సమీకరణాలు, కార్యకర్తల మనో భావాలను పరిశీలించి అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.








# భక్తికి,ఆధ్యాత్మికతకు నెలవు రాజంపేట

ఇకపై హత్యరాలలో ప్రతి పౌర్ణమితి గంగా హారతి – ఆలయంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి

పంచలోహ విగ్రహాల వితరణ – తెదేపా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు



రాజంపేట మనం ప్రతినిధి సెప్టెంబర్ 23
రాజంపేట గడ్డ భక్తికి,ఆధ్యాత్మికతకు నెలవు అని,అన్నమయ్య,కన్నప్ప వంటి మహా భక్తుల జన్మస్థలి అయిన రాజంపేటను టెంపుల్ టూరిజం హబ్ గా అభివృద్ధి పరచేందుకు కృషి చేస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. నేడు హత్యరాల శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామి ఆలయ కమిటీ,గిరి ప్రదక్షణ కమిటీ,దక్షిణ దయ అపర కర్మ సేవా ట్రస్ట్ వారి సమక్షంలో జగన్ మోహన్ రాజు పంచలోహ విగ్రహాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ టెంపుల్ టూరిజంను అభివృద్ధి పరచాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఐటి మరియు విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు గార్ల ఆదేశాల మేరకు రాజంపేటలో పరమ పవిత్రమైన హత్యరాల పుణ్యక్షేత్రంలో భక్తులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి పరుస్తామని చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు. ఆలయ కమిటీ,గిరి ప్రదక్షిణ కమిటీ,టీటీడీ వేద పండితులు వారి సహకారంతో ఇకపై ప్రతి పౌర్ణమికి కాశీలో వలె గంగా హారతి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భక్తులు జాతక మరియు గ్రహదోషాలు పోగొట్టుకోవడంతో పాటు సంకల్పానికి దైవ బలం తోడయ్యే విధంగా హత్యరాల పుణ్యక్షేత్రంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని,భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పునీతులు కావాలని కోరారు. గిరి ప్రదక్షణ సమయంలో అవసరమైతే పాఠశాలలకు సంబంధించిన బస్సులతో పాటు ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసే విధంగా కూడా కృషి చేస్తామని తెలియజేశారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి సంకల్పాలు నెరవేర్చుకుని తరించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆలయ అర్చకులు,గిరి ప్రదక్షణ కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.



## తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో శివనారాయణ చౌదరి భేటీ

రాజంపేట నియోజకవర్గ రాజకీయాలపై చర్చ

ఇన్‌ఛార్జి జగన్మోహన్ రాజుతో కలిసి పనిచేయాలని సూచన



మనం ప్రతినిధి రాజంపేట సెప్టెంబర్ 23
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కడప జిల్లా కమ్మసంఘం అధ్యక్షుడు, తెదేపా సీనియర్ నాయకుడు శివనారాయణ చౌదరి అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలు, తాజా రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు. నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి జగన్మోహన్ రాజు నాయకత్వంలో పార్టీ బలోపేతం అవుతున్న తీరును శివనారాయణ చౌదరి రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గవ్యాప్తంగా కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఇన్‌ఛార్జి విస్తృతంగా కృషి చేస్తున్నారని వివరించారు. దీనిపై స్పందించిన పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి, రాబోయే ఎన్నికల్లో కూటమి విజయానికి నాయకులు, కార్యకర్తలంతా ఇన్‌ఛార్జి జగన్మోహన్ రాజుతో సమన్వయం చేసుకుంటూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.




## పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ-కేవైసీ తప్పనిసరి

ముద్దనూరు సెప్టెంబర్ 23 మనం న్యూస్ : మండలంలోని ముద్దనూరు గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. రబీ పంటల సాగుకు రైతులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శనగ పంట సాగు చేసే రైతులకు అవసరమైన విత్తనాలను త్వరగా పంపిణీ చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన పత్తి పంటను పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని, అవసరమైన మేరకే పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.కన్నా, రైతులు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, నాగేశ్వర్‌నాయుడు, శివ, మధుసూదన్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

**ఇంటికి అవసరమైన వస్తువులను అందజేసిన కూటమి నాయకులు రాజుకుంట నరసింహ, నానబాల నాగార్జున**



చిట్వేలీ సెప్టెంబర్ 23 మనం న్యూస్: చిట్వేలి పట్టణంలోని సింగనమాల వీధికి చెందిన టంగుటూరి ప్రసాద్ పూరిగుడిసె ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంటితో పాటు ఇంట్లోని సామగ్రిని కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న చిట్వేలి మండల టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ రాజుకుంట నరసింహ, జనసేన నాయకులు నానబాల నాగార్జున బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ప్రమాదం కారణంగా ఇంట్లోని వస్తువులు దెబ్బతినడంతో కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితిని తెలుసుకుని వారికి అండగా నిలిచారు. ఇంటిని తిరిగి ఉపయోగించుకునేందుకు అవసరమైన ప్రతి వస్తువును సమకూర్చి అందించారు. అగ్ని ప్రమాదంతో తీవ్ర నష్టానికి గురైన ఆ కుటుంబానికి అవసరమైన సామగ్రిని అందించి తమ వంతు సహకారం అందించారు. ఆపద సమయంలో తమను పరామర్శించి, ఇంటికి అవసరమైన వస్తువులను అందించిన రాజుకుంట నరసింహకు, నానబాల నాగార్జునకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి అవసరమైన సహాయం అందించిన వారిని స్థానికులు అభినందించారు.

## ప్రొద్దుటూరులోని స్టీల్, ఐరన్, గ్లాస్ అల్యూమినియం ఓనర్లు ఢ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు..ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి వినతి



ప్రొద్దుటూరు :మనం న్యూస్ (23)? ప్రొద్దుటూరులో దాదాపు 10 వేల కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. ?ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వారు, పెద్ద కాంట్రాక్టర్లు తక్కువ రేట్లకు పనులు చేస్తూ స్థానిక పనులన్నీ దక్కించుకుంటున్నారు అంటూ ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చి ఆవేదన చెందారు.. ?సరిపడా పనులు లేకపోవడం వల్ల షాపులు రూముల అద్దెలు, కరెంట్ బిల్లాలు, పనివారి జీతాలు కూడా చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం. ?వేరే పనులు చేసే నైపుణ్యం లేకపోవడంతో, అప్పులు తీర్చలేక భవిష్యత్తులో ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ నిర్మాణ పనుల్లో స్థానిక వృత్తిదారులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇతర రాష్ట్రాల నుండి లైసెన్స్ లేకుండా వచ్చి పనిచేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలి. చిన్న వృత్తిదారులకు తక్కువ వడ్డీకే రుణాలు, సబ్సిడీలు అందించాలి. అదేవిధంగా వర్కర్ల కోసం తక్కువ అద్దెతో ఒక ప్రత్యేక 'ట్రేడ్ కాంప్లెక్స్' లేదా పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలి వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో దస్తగిరి, వల్లి, మొహమ్మద్ రఫీ, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు..





# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

**తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు - కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన చమర్తి జగన్ మోహన్ రాజు**



రాజంపేట మనం ప్రతినిధి సెప్టెంబర్ 23
రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమష్టి కృషితో ముందుకు సాగాలని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు. బుధవారం నాడు రాజంపేట పట్టణం,స్థానిక చీఖచీ కళ్యాణ మండపం నందు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి పార్టీ నియోజకవర్గ పరిశీలకులు భీమినేని చిట్టిబాబు గారితో కలిసి చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని,క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చమర్తి సూచించారు.
అంతేకాకుండా గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా కార్యకర్తలంతా ఐక్యతతో పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని చమర్తి జగన్ మోహన్ రాజు కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని,స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని చమర్తి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర డైరెక్టర్లు/మార్కెట్ చైర్మన్లు/సొసైటీ చైర్మన్లు/రాష్ట్ర కమిటీ సభ్యులు/పార్లమెంట్ కమిటీ సభ్యులు/మండల అధ్యక్షులు/ప్రధాన కార్యదర్శులు/పట్టణ అధ్యక్షులు/గ్రామ అధ్యక్షులు/బూత్ కన్వీనర్లు/అనుబంధ సంఘాల అధ్యక్షులు/పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన కేఎఫ్ డబ్ల్యు జర్మనీ బృందం




కడప సెప్టెంబర్ 23 మనం న్యూస్
కే ఎఫ్ డబ్ల్యు జర్మనీ బ్యాంకుకు చెందిన పరిశోధన భాగస్వాముల బృందం బుధవారం వైఎస్సార్ కడప జిల్లాలో పర్యటించి ప్రకృతి వ్యవసాయ అమలు తీరు, రైతుల అనుభవాలు, పంటల సాగు విధానాలతో పాటు రైతుల ఆదాయ పరిస్థితులు, మార్కెట్ అనుసంధానం, పరిశోధన ఆధారిత వ్యవసాయ విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ పర్యటనలో కే ఎఫ్ డబ్ల్యు జర్మనీకి చెందిన ఆర్థికవేత్త ఐరిస్ హార్డర్, కే ఎఫ్ డబ్ల్యు న్యూఢిల్లీ సీనియర్ నిపుణురాలు సంగీత అగర్వాల్ పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా తొలుత పులివెందుల మండలంలోని డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని అరటి సాగు క్షేత్రాలను బృందం సందర్శించింది. రసాయన వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న క్షేత్రంతో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న క్షేత్రాన్ని పరిశీలించారు. రెండు విధానాల్లో అనుసరిస్తున్న సాగు పద్ధతులు, పంట నిర్వహణ, దిగుబడి, రైతుల అనుభవాలు, ఆదాయ పరిస్థితులపై వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో బృంద సభ్యులు మాట్లాడి వ్యవసాయ అనుభవాలను తెలుసుకున్నారు. రైతులు తమ సాగు విధానాలు, పంటల ద్వారా పొందుతున్న ఆదాయం, మార్కెట్లో ఎదురవుతున్న సమస్యలు, ఉత్పత్తులకు న్యాయమైన ధరలు పొందేందుకు అవసరమైన చర్యలు వంటి అంశాలను వివరించారు. రైతుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, ఎగుమతుల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై కూడా చర్చించారు. అనంతరం పులివెందుల మండలం ఎర్రం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీమతి శివకుమారి సాగు చేస్తున్న యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్ (యూ.ఓ.ఆర్.) ప్రాజెక్టు పరిధిలో కొనసాగుతున్న అరటి క్షేత్రాన్ని బృంద సభ్యులు పరిశీలించారు. అరటి సాగులో పంట అనంతరం లభించే అరటి కాండాన్ని విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి వినియోగించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం పొందేందుకు గల అవకాశాలపై బృందం చర్చించింది. రైతులను ప్రాసెసింగ్ కేంద్రాలు, మార్కెట్ వ్యవస్థలతో అనుసంధానం చేయడం ద్వారా వ్యవసాయ ఆదాయాన్ని మరింత పెంచుకునే అవకాశాలను పరిశీలించారు.
అనంతరం పులివెందులలోని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఆఫ్ అగ్రోఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్‌లో జర్మనీ బృందంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరిశోధనలు, అధ్యయనాలు, వాటి ద్వారా సాధిస్తున్న ఫలితాలు, పరిశోధనల ద్వారా రైతులకు అందుతున్న ప్రయోజనాలు, క్షేత్రస్థాయిలో వాటి వినియోగంపై వివరించారు. ఈ సందర్భంగా పరిశోధనల ద్వారా సాధిస్తున్న ఫలితాలను శ్రీమతి సంగీత అగర్వాల్ అభినందించారు. పరిశోధన సంస్థలు, శాస్త్రవేత్తలు, రైతులు, రైతు మార్గదర్శకుల మధ్య సమన్వయం ద్వారా ప్రకృతి వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలను సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో కే ఎఫ్ డబ్ల్యు బృందం, రైతు శాస్త్రవేత్తలు, రైతు మార్గదర్శకులతో పరస్పర చర్చలు జరిపింది.
ఈ పర్యటనలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు జి. మురళీధర్, శివకుమార్, సుధాకర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ కుమార్, అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వసంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే కోడూరులో జడ్పిటిసి ఎంపిటిసిలకు ఘన సన్మానం చేసిన రామిరెడ్డి ధ్వజారెడ్డి





రైల్వే కోడూరు, సెప్టెంబర్ 23, మనం న్యూస్
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు ఎంపీడీవో కార్యాలయంలో ఐదేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు వైస్ ఎంపీపీ రామిరెడ్డియు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు సింగమల భవానీ మరియు స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధుల సేవలను కొనియాడుతూ వారిని దుశ్శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, సిబ్బంది కోసం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి జడ్పీటీసీలు, ఎంపీటీసీలు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. తన ఐదేళ్ల పదవీకాలంలో పూర్తిస్థాయిలో సహకరించిన సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు మరియు ప్రజలందరికీ వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. హరితమ్మ, కార్యాలయ సిబ్బంది, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, వైసీపీ పార్టీ సీనియర్ నాయకులు తోట శివ సాయి, సిద్దయ్య, చంగల్ రెడ్డి, ఆర్వి రమణ, హరికృష్ణ రెడ్డి, గోపి, చంద్రశేఖర్, కొన్నిపాటి ప్రసాద్, షఫీ, సుబ్రహ్మణ్యం మరియు మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# వి.వి. కండ్రికలో ప్రభుత్వ భూములను దళితులకు, గిరిజనులకు పంచాలి



రైల్వే కోడూరు, సెప్టెంబర్ 23, మనం న్యూస్
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలం వి.వి. కండ్రిక గ్రామంలోని ప్రభుత్వ భూములను దళితులకు, గిరిజనులకు పంపిణీ చేయాలని మరియు జరుగుతున్న భూకబ్జాలను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల సెప్టెంబర్ 28న పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సిఐటియు , ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో వి.వి. కండ్రిక గ్రామం నుండి కోడూరు ఎమ్మార్వో కార్యాలయం వరకు ఈ పాదయాత్ర సాగనుంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం వి.వి. కండ్రిక గ్రామంలో దళితులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సిహెచ్. చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పందికాళ్ల మణి పాల్గొని ప్రసంగించారు.
వారు మాట్లాడుతూ, వి.వి. కండ్రిక గ్రామంలోని సర్వే నంబరు 130 లో ఉన్న 300 ఎకరాలు, సర్వే నంబరు 142 లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమాలకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ, రెవెన్యూ అధికారుల అండదండలతోనే ఈ భూకబ్జాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.
సమస్య తీవ్రతపై నాయకులు పలు ప్రశ్నలు గుప్పించారు:
రేయింబవళ్లు జేసీబీ యంత్రాలు పెట్టి సుమారు 350 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే రెవెన్యూ యంత్రాంగం ఏం చేస్తోంది?
అక్రమ కబ్జాలకు ఉపయోగిస్తున్న జేసీబీలను ఎందుకు సీజ్ చేయలేదు?
కబ్జాలకు పాల్పడుతున్న అగ్రవర్ణ భూస్వాములపై ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోలేదు?
ఆ భూముల్లో సాగు చేసుకోవడానికి రెవెన్యూ అధికారులు ఏమైనా వారికి పట్టాలు ఇచ్చారో లేదో స్పష్టం చేయాలి.
గతంలో మైనింగ్ లీజు పేరుతో ఈ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించినప్పుడు సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి ప్రభుత్వ భూమిని కాపాడాయని, ఆ భూమిని దళితులకే ఇస్తామని నాటి రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ తర్వాత అనేకసార్లు విన్నపాలు చేసినా, ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు.
ప్రభుత్వ భూములను దళితులకు, గిరిజనులకు కేటాయించి వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలని, అందుకు సెప్టెంబర్ 28న జరిగే పాదయాత్రకు ప్రజలు, దళిత–గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొజ్జ శివయ్య, సిఐటియు నాయకులు నగిరిపాటి ఆనంద్, రైతు సంఘం నాయకులు నాగేశ్వరయ్య మరియు గ్రామ దళితులు, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 11వ బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ రిహార్సల్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ







సిద్ధవటం సెప్టెంబర్ 22(మనం న్యూస్) ఈ నెల 26 న జరగనున్న కడప పోలీస్ శిక్షణా కేంద్రం, భాకరాపేట 11వ బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న 548 కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌కు సంబంధించి నిర్వహించిన రిహార్సల్‌ను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్. బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్ల పరేడ్ కవాతు, డ్రిల్, మార్చింగ్, కమాండ్లకు అనుగుణంగా స్పందించే విధానం, క్రమశిక్షణ, సమన్వయం తదితర అంశాలను ఎస్పీ నిశితంగా పరిశీలించారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో ప్రతి ఒక్కరూ పూర్తి క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసంతో పాల్గొనాలని ఎస్పీ గారు సూచించారు. పోలీసు విధుల్లో క్రమశిక్షణ, శారీరక దారుఢ్యంతో పాటు ప్రజల పట్ల బాధ్యత, నిబద్ధత, సేవాభావం అత్యంత కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో పొందిన నైపుణ్యాలను భవిష్యత్తులో విధుల్లో సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. పాసింగ్ అవుట్ పరేడ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో 11వ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ రెడ్డి, కడప డి.టి.సి డి.ఎస్పీ అబ్దుల్ కరీం, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, పోలీసు సిబ్బంది, శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయండి



చిట్వేలీ సెప్టెంబర్ 23 మనం న్యూస్: స్థానిక పియం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈనెల 25న నిర్వహిస్తున్న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వైద్య, విద్యాశాఖ అధికారులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల వైద్య అధికారి శివప్రసాద్ గౌడ్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈఓ ఖాజమైద్దీన్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన నిర్వహించే నులిపురుగుల దినోత్సవం విజయవంతం చేయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సహకరించాలని, పిల్లల ఆరోగ్యం భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సూచనలు అందించారు. ఈ అవగాహన కార్యక్రమంలో, ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు సోఫియా, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు పసుపుల రాజశేఖర్, హెల్త్ సూపర్వైజర్ ఇస్మాయిల్, అంగన్వాడి సూపర్వైజర్ వసుంధర, హెచ్.ఈ.ఓ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు సుభాష్ చంద్రబోస్, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్.. ఎనిమిదేళ్లలో కుటుంబాలకు రూ.2లక్షల కోట్ల ఆదా

ఆయుష్మాన్ భారత్ పథకానికి ఎనిమిదేళ్లు పూర్తి

60 కోట్ల మందికి రూ. 5 లక్షల వార్షిక ఆరోగ్య రక్షణ

దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ఏర్పాటు

ఈ నెట్‌వర్క్‌లో 38,000కు పైగా ఆసుపత్రులు భాగం



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం విజయవంతంగా ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం స్పందిస్తూ.. ప్రతి భారతీయుడికి నాణ్యమైన, అందుబాటు ధరలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యం తో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఈ పథకం ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంగా నిలిచిందని ఆయన కొనియాడారు.
ఈ విషయంపై ప్రధాని మోదీ సోషల్ మీడియా 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "ఎనిమిదేళ్ల క్రితం, ప్రతి భారతీయుడికి అత్యుత్తమ, అందుబాటు ధరలో వైద్యం అందాలనే ఆలోచనతో ఆయుష్మాన్ భారత్ ప్రారంభమైంది. ఈ రోజు, 60కోట్లకు పైగా లబ్ధిదారులకు ఏటా రూ.5లక్షల ఆరోగ్య కవరేజీ అందుబాటులో ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకం" అని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య ఖర్చులు రికార్డు స్థాయిలో ఆదా అవుతున్నాయని ప్రధాని తెలిపారు. అంతేగాక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ద్వారా వైద్య సేవలు ప్రజల ముంగిటకే చేరుతున్నాయని, ఇప్పటికే ఈ కేంద్రాల్లో 500కోట్లకు పైగా సందర్శనలు నమోద య్యాయని ప్రధాని వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామీణ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ బలపడుతోందని ఆయన అన్నారు.

**విజయాలను వివరించిన MyGovIndia**

ఆయుష్మాన్ భారత్ ఎనిమిదేళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలను MyGovIndia కూడా తన పోస్టులో వివరించింది. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం–జేఏవై) కింద అందించిన ఉచిత చికిత్సల వల్ల కుటుంబాలకు రూ. 2 లక్షల కోట్లకు పైగా వైద్య ఖర్చులు ఆదా అయ్యాయని తెలిపింది. దేశవ్యాప్తంగా 38,000కు పైగా ఆసు పత్రులు ఈ నెట్‌వర్క్‌లో భాగమయ్యాయని, ఇప్పటివరకు 13 కోట్లకు పైగా హాస్పిటల్ అడ్మిషన్లు జరిగాయని పేర్కొంది. 70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది సీనియర్ సిటిజన్లను వారి సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చారు. మొత్తం ఆయుష్మాన్ కార్డుల్లో దాదాపు సగం మహిళల పేరు మీద ఉండటం గమనార్హం.
ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా మధుమేహం, రక్తపోటు కోసం 42 కోట్లకు పైగా స్క్రీనింగ్‌లు, అలాగే నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల కోసం కోట్ల సంఖ్యలో పరీక్షలు నిర్వహించారు.
ఈ పథకం పోర్టబిలిటీ సదుపాయం ద్వారా లబ్ధిదారులు తమ సొంత రాష్ట్రం వెలుపల కూడా రూ. 8,800 కోట్లకు పైగా విలువైన 30 లక్షలకు పైగా చికిత్సలు పొందారని MyGovIndia వెల్లడించింది. మొత్తంగా, 60 కోట్ల మందికి రూ. 5 లక్షల ఆరోగ్య బీమా అందిస్తూ, తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో ఈ పథకం ఆర్థిక భద్రతను కల్పిస్తోంది.

## అత్యంత వైభవంగా త్రిశూల స్నానం

కాణిపాకం మనం న్యూస్ : కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం వసంతోత్సవం మరియు త్రిశూల స్నానం అత్యంత వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహిం చడం జరిగింది, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , మరియు చైర్మన్ మణి నాయుడు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వసంత, కృష్ణవేణి, అనసూయ, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

